వేంకటేశ్వరునికి వెండి కిరీటం



అంబాజీపేట: స్థానిక కొర్ల పాటివారిపాలెంలో భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి బండారులంక లేఅవుట్ సిండికేట్ సభ్యులు, భక్తుల ఆధ్వర్యంలో రూ.1.10 లక్షల విలువైన వెండి కిరీటాన్ని శనివారం సమర్పించారు.



నిండు ప్రాణాలు.. గోదారమ్మ ఒడిలోకి..

రావులపాలెం వద్ద గౌతమీ గోదావరిలో స్నానానికి వెళ్లిన యువకుల్లో ముగ్గురు గల్లంతయ్యారు. వారిలో ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. మరొకరి ఆచూకీ తెలియాల్సి ఉంది. - 8లో

గరిష్టం/కనిష్టం 38.0°/26.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	33.0	26.0
కాకినాడ	36.5	26.2
అమలాపురం	38.0	26.0

న్యూస్‌రీల్

శృంగార వల్లభునికి రూ.4.04 లక్షల ఆదాయం



ప్రత్యేక అలంకరణలో శృంగారవల్లభ స్వామి

పెద్దాపురం: తొలి తిరుపతి గ్రామంలో వేంచేసిన శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామివారిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 15 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుని, ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. దర్శనం, కేశఖండన టికెట్లు, అన్నదానం విరాళాల ద్వారా స్వామి వారికి రూ.4,04,592 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఆయనతో పాటు ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు ఆధ్వర్యాన భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానంతో పాటు మజ్జిగ కూడా అందించామని ఈఓ తెలిపారు.

ప్రశాంతంగా ఏపీ ఈఏపీ సెట్

బాలాజీ చెరువు (కాకినాడ సిటీ): ఇంజినీరింగ్, అగ్రికల్చరల్, ఫార్మసీ కోర్సులలో ప్రవేశానికి జరుగుతున్న ఏపీ ఈఏపీ సెట్ మూడో రోజైన శనివారం ప్రశాంతంగా జరిగాయి. ఇంజినీరింగ్ విభాగంలో ఈ ఆన్‌లైన్ పరీక్షలను 1,060 మంది రాశారు. 53 మంది గైర్హాజరయ్యారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆదేశాల మేరకు జేఎన్‌టీయూకే ఉప కులపతి డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు కాకినాడ అయాన్ ఇనిస్టిట్యూట్‌లోని పరీక్ష కేంద్రాన్ని ఈఏపీ సెట్ కో ఆర్డినేటర్ వెంకటరెడ్డితో కలిసి పరిశీలించారు.

అగ్నిప్రమాదాలపై ఎన్‌సీసీ క్యాడెట్లకు అవగాహన



అగ్నిప్రమాదాల నివారణపై ఎన్‌సీసీ క్యాడెట్లకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పెద్దాపురం: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో నిర్వహిస్తున్న శిబిరంలో ఎన్‌సీసీ క్యాడెట్లకు అగ్నిప్రమాదాలపై శనివారం అవగాహన కల్పించారు. ఆంధ్రా, తెలంగాణ ఎన్‌సీసీ ఇంటర్ డైరెక్టరేట్ స్పోర్ట్స్ షూటింగ్ చాంపియన్‌షిప్ (ఐడీఎస్ఎస్‌సీ)–2024కు ఎంపికైన క్యాడెట్లకు వివిధ అంశాల్లో ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు. ఇందులో భాగంగా పెద్దాపురం అగ్నిమాపక అధికారి శ్రీహరి జగన్నాథం ఆధ్వర్యాన అగ్నిప్రమాద సమయంలో పాటించాల్సిన అంశాలపై క్యాడెట్లకు శిక్షణ ఇచ్చారు. కాకినాడ 18వ ఆంధ్రా బెటాలియన్ కమాండెంట్ కల్నల్ వివేక్ సావన్ గౌడర్ మాట్లాడుతూ, ఎన్‌సీసీతో ప్రతి విద్యార్థికీ మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. విద్యార్థికి దృఢ సంకల్పం, ఆత్మ విశ్వాసం, నిబద్ధతతో కూడిన శిక్షణ ఎన్‌సీసీతోనే సాధ్యపడుతుందని అన్నారు. అనంతరం లైఫ్‌బాయ్, లైఫ్ జాకెట్ వినియోగం, ఫైర్ సిలిండర్‌లోని కార్బన్ డయాక్సైడ్ ద్వారా అగ్ని ప్రమాదాన్ని ఏవిధంగా నివారించవచ్చనే అంశాలపై అవగాహన కల్పించారు.

గురుకుల పాఠశాలల్లో ఇంటర్ ప్రవేశాలు పూర్తి

కాకినాడ సిటీ: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలు పూర్తయ్యాయి. స్థానిక సాంబమూర్తి నగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో శనివారం తుది దశ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇంటర్మీడియెట్ అన్ని కేటగిరీల్లో ఇంగ్లిషు మీడియం ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో మిగిలిన 584 స్లాట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష రాసిన 1,069 మంది అభ్యర్థులను ఇంటర్వ్యూలకు పిలిచారు. ఈ కౌన్సెలింగ్‌లో ఓసీ 9, బీసీ 36, బీసీ–సి 1, ఎస్టీ 35, ఎస్సీ 375 సీట్లు భర్తీ చేశామని సంస్థ కౌన్సెలింగ్ జిల్లా సమన్వయాధికారి జి.వెంకటరావు తెలిపారు. బీసీ–సిలో 104 సీట్లు ఖాళీగా ఉండగా, వాటిలో ఎస్సీ కేటగిరీ నుంచి 94 మందిని భర్తీ చేశామన్నారు. కార్యక్రమంలో కౌన్సెలింగ్ జిల్లా కమిటీ సభ్యులు, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, సహాయ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సర్కారు వారి పాఠాలకు.. సై



- ప్రభుత్వ చర్యలతో మెరుగుపడిన కళాశాలలు
- సగర్వంగా కాలరెగరేస్తున్న విద్యార్థులు
- అక్కడికే క్యూ కడుతున్న వైనం
- అడ్మిషన్లపై కార్పొరేట్‌కు దీటుగా అధ్యాపకుల ప్రచారం

జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు	ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలు	గత ఏడాది ప్రథమ సంవత్సరం విద్యార్థులు
కళాశాలలు - 15	గురుకుల కళాశాలలు - 8	- 19,500
హైస్కూల్ ప్లస్ - 14	ప్రైవేటు ఎయిడెడ్ - 4	ద్వితీయ సంవత్సరం
మోడల్ స్కూల్స్ - 2	ప్రైవేటు అన్ ఎయిడెడ్ - 99	- 15,400
కేజీబీవీ కళాశాలలు - 4	మొత్తం - 146	

పిఠాపురం: అంతర్జాతీయ ప్రమాణాలు.. పరిమిత సీట్లు.. గ్లోబల్ ఎడ్యుకేషన్.. ఐఎఫ్‌పీలు.. వైఫై డిజిటల్ క్లాస్ రూములు.. అధిక అర్హత కలిగిన సబ్జెక్టు నిపుణులతో విద్యా బోధన.. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు.. టోఫెల్ ఆంగ్ల విద్యా బోధన.. ఇంటివద్ద కూడా పాఠాలు అర్థం చేసుకోవడానికి వీలుగా బైజూస్ కంటెంట్ ట్యాబ్‌లు.. భవిష్యత్తు నైపుణ్యాల ఆధారిత విద్య.. రుచికరమైన వంటకాలతో కూడిన పరిశుభ్రమైన పౌష్టికాహారం.. జిమ్ పరికరాలతో కూడిన విశాలమైన ప్లే గ్రౌండ్లు.. ఇవన్నీ చదువుతూంటే ఏదో ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు చేస్తున్న ప్రచారం అనుకుంటే పొరపాటు పడినట్టే. ఇదంతా కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల అధ్యాపకులు విద్యార్థుల తల్లిదండ్రులను ఆకట్టుకునేలా చేస్తున్న ప్రచారం.



పిఠాపురం మండలం పి.దొంతమూరు పాఠశాల విద్యా ప్రమాణాలను ప్రచారం చేస్తూ రూపొందించిన ఫ్లెక్సీ

విద్యా సంవత్సరం ప్రారంభమవుతోందంటే చాలు.. 1, 1, 2, 3, 3, 4, 5.. ఇలా చెవుల తుప్పు వదిలిపోయేలా ర్యాంకుల అంకెలు గడగడా చదివేస్తూ.. అసాధారణ ఫలితాలు.. అద్భుత విజయాలు తమ సొంతం అంటూ టీవీల్లో ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రచారంతో ఊదరగొట్టేస్తూంటాయి. అక్కడ చెప్పేదే చదువని.. అక్కడే విద్యా ప్రమాణాలు బావుంటాయనే భావన కొన్ని దశాబ్దాలుగా తల్లిదండ్రుల్లో బలంగా నాటుకుపోయింది. చివరకు ప్రభుత్వ ఉపాధ్యాయులు, అధ్యాపకులు కూడా తమ పిల్లలను ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో చేర్చే స్థాయిలో ఈ తప్పుడు నమ్మకం బలపడిపోయింది. తీవ్ర స్థాయికి చేరిన ప్రచారం నేపథ్యంలో ప్రైవేటు విద్యా సంస్థల్లో తప్ప మరెక్కడా ర్యాంకు రాదనేంతగా ప్రజల మనసుల్లో బలమైన ముద్ర పడిపోయింది.

ప్రభుత్వ ప్రోత్సాహంతో..

అయితే, ఇటువంటి భావన పూర్తిగా తప్పని గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు నిరూపిస్తున్నారు. సరైన తోడ్పాటు, ప్రోత్సాహం, బోధన అందిస్తే కార్పొరేట్‌కు తాము ఏవిధంగానూ తీసిపోమనే రీతిలో మెరుగైన ఫలితాలు సాధిస్తూ, సగర్వంగా కాలరెగరేస్తున్నారు. గడచిన ఐదు సంవత్సరాలుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ విద్యారంగానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారు. పాఠ్యాంశాలు, బోధనా విధానాలు, తరగతి గదుల్లో సౌకర్యాలు, ఆకట్టుకునే రీతిలో పుస్తకాలు.. ఇలా అన్నివిధాలా విద్యార్థులను ఆకట్టుకునేలా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోని పరిస్థితుల్ని మార్చేశారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తూ ప్రైవేటు పాఠశాలలకు సవాల్ విసురుతున్నారు.

వినూత్న ప్రచారం

ఫలితంగా 'సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలు సాధించిన విద్యా సంస్థ' అంటూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు గర్వంగా చెప్పుకోగలిగిన రోజులు వచ్చాయి. ఈ మేరకు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల ఉపాధ్యాయులు, అధ్యాపకులు వినూత్న ప్రచారానికి శ్రీకారం చుడుతున్నారు. తమ పాఠశాలలు, కళాశాలల్లో చదివిన ప్రతిభను వివరిస్తూ ఫ్లెక్సీలు రూపొందిస్తున్నారు.



తమ విద్యార్థులు సాధించిన ఉత్తమ ఫలితాలతో చేబ్రోలు ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు తయారు చేసిన ఫ్లెక్సీ

వీటిని ఆయా గ్రామాలు, పట్టణాల్లో విద్యార్థుల తల్లిదండ్రులను ఆకట్టుకునే రీతిలో ప్రదర్శిస్తున్నారు. నూతన విద్యా సంవత్సరం కొద్ది రోజుల్లో ప్రారంభమవుతున్న వేళ పలు గ్రామాల్లో ఈ తరహా ప్రచారం జోరుగా జరుగుతోంది. అంతే కాదు.. కొంతమంది అధ్యాపకులు మరో అడుగు ముందుకేసి.. ఆటోలకు మైకులు పెట్టి మరీ ప్రచారం చేస్తున్నారు. 'ఒక్క పైసా కూడా ఖర్చు లేదు. మీకు చదవాలనే ఆసక్తి ఉంటే చాలు. అన్ని వసతులూ కల్పిస్తాం. రండి.. చదువుకోండి.. మంచి ఉన్నత స్థానాలకు చేరుకోండి' అంటూ ప్రభుత్వ విద్యా సంస్థలు ఆకట్టుకునేలా ఆహ్వానం పలుకుతూంటే.. విద్యార్థులు కూడా అంతే ఉత్సాహంతో క్యూ కడుతున్నారు.

విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు



గతంలో అందరూ ప్రైవేటు కళాశాలల వైపే మొగ్గు చూపేవారు. కానీ ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోని ఉత్తమ విద్యా ప్రమాణాలను చూసిన విద్యార్థులు ఎక్కువ మంది వీటిల్లో చేరేందుకే ఇష్టపడుతున్నారు. ఈ ఏడాది అడ్మిషన్లు బాగా పెరిగే అవకాశాలున్నాయి. మా కళాశాలలో చేరడానికి ఇప్పటికే చాలా మంది సిద్ధమయ్యారు. పాఠశాలలు తెరిచే సమయానికి మరింతగా పెరుగుతారని నమ్ముతున్నాం. పలు గ్రామాల్లోని హైస్కూళ్లను ప్రభుత్వం కళాశాలలుగా మార్చింది. సొంత గ్రామంలో కళాశాల రావడంతో ఇక్కడ చదువుకోవడానికే అందరూ ఉత్సాహం చూపుతున్నారు.

– ఎస్.శాంతి రాజశ్రీ, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల (హైస్కూలు ప్లస్), చేబ్రోలు, గొల్లప్రోలు మండలం

ఇంటర్ కూడా ఇక్కడే..



నేను చిన్నప్పటి నుంచీ చేబ్రోలు స్కూల్లోనే చదువుకున్నా. మా ఊళ్లో పదో తరగతి అయ్యాక పక్క ఊరు వెళ్లి చదువుకోవాలంటే భయమేసేది. చాలా టెన్షన్ పడేదానిని. కానీ అనుకోకుండా సీఎం వైఎస్ జగన్ ముందు చూపుతో ఆలోచించి, ప్రభుత్వ హైస్కూళ్లను జూనియర్ కాలేజీలుగా మార్చారు. ఇప్పటి వరకూ నాతో చదువుకున్న వారితోనే మళ్లీ ఇక్కడే ఇంటర్ కూడా చదువుకునే అవకాశం రావడం, ఇప్పటి వరకూ మాకు చదువు చెప్పిన వారే తిరిగి లెక్చరర్లుగా రావడం ధైర్యాన్ని, ఉత్సాహాన్ని ఇచ్చింది. ఇంటర్ ఇక్కడే జాయిన్ అవుతున్నా. బాగా కష్టపడి చదువుకుని, మంచి మార్కులు సాధిస్తా.

– పి.కాంతం, పదో తరగతి విద్యార్థిని, చేబ్రోలు

ఇప్పుడు ఎక్కడైనా చదవగలం



ఇంటర్ అంటే వేరే లోకంలోకి వెళుతున్నట్టే. కొత్త ఊరు, కొత్త స్నేహితులు, కొత్త లెక్చరర్లు.. ఇలా అన్నీ కొత్తగా ఉంటాయి. అలాంటి చోట అడుగు పెట్టాలంటే అందరికీ టెన్షన్ తప్పదు. అలాంటిది మాకు మా ఊళ్లోనే ఇంటర్ చదువుకునే వీలును సీఎం వైఎస్ జగన్ కల్పించారు. దీంతో మాలాంటి బాలికలకు మంచి భవిష్యత్తును అందించినట్టే. కాలేజీ అంటే ఉండే భయం పోయి ఇప్పుడు ఎక్కడికైనా వెళ్లి చదవగలమనే ధైర్యం వచ్చేసింది. ఇక్కడ చదువు కూడా బాగా చెబుతున్నారు. అంతా పాత వారే కావడంతో బాగా చదువుకుంటున్నాం. ఫస్టియర్ ఎంపీసీ పరీక్షల్లో 470 మార్కులకు 454 మార్కులు సాధించాను.

– ప్రవల్లికా జోయ్, ఇంటర్ ప్రథమ సంవత్సరం, చేబ్రోలు

గ్రూప్–2 మెయిన్ పరీక్షకు ఉచిత శిక్షణ

కాకినాడ సిటీ: ఏపీపీఎస్సీ గ్రూప్–2 మెయిన్ పరీక్షలకు హాజరయ్యే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అభ్యర్థులకు ఈ నెల 25 నుంచి ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారి ఎం.లల్లీ శనివారం విలేకర్లకు ఈ విషయం తెలిపారు. గ్రూప్–2 ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణులైన వారికి అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణ ఇస్తామన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అభ్యర్థులకు రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల వెనుకన జయకృష్ణాపురం గణేష్ నగర్లో ఉన్న వెనుకబడిన తరగతుల అధ్యయన కేంద్రంలో ఈ శిక్షణ ఇస్తారని వివరించారు. శిక్షణతో పాటు ప్రతి సబ్జెక్టుకు ప్రాక్టీసు టెస్టులు, గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తారన్నారు. లైబ్రరీ, స్టడీ మెటీరియల్ అందుబాటులో ఉన్నాయన్నారు. ఎంపికైన వారికి స్టైపెండ్, బుక్స్ అలవెన్స్ వంటి సౌకర్యాలు కూడా ఉంటాయని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అభ్యర్థులు 'డైరెక్టర్, ఏపీ బీసీ స్టడీ సర్కిల్, ఆర్ట్స్ కాలేజీ వద్ద, రాజమహేంద్రవరం' చిరునామాకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గతంలో బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్–2 ప్రిలిమ్స్‌లో 77 మంది అభ్యర్థులు శిక్షణ తీసుకోగా 26 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. వివరాలకు 0884–2421129, 939393 4825, 8639 44 7339 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని లల్లీ సూచించారు.

ఇంటర్ సప్లిమెంటరీకి రెడీ

- 24 నుంచి 31 వరకూ నిర్వహణ
- జిల్లాలో 22,379 మంది దరఖాస్తు
- 29 కేంద్రాల ఏర్పాటు



బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గత మార్చి 1 నుంచి 20వ తేదీ వరకూ ఇంటర్ రెగ్యులర్ పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. వీటి ఫలితాలను గత నెల 12వ తేదీన విడుదల చేశారు. వీటిల్లో ఫెయిలైన, అత్యుత్తమ మార్కుల కోసం బెటర్‌మెంట్‌కు సిద్ధమైన విద్యార్థులకు ఈ నెల 24 నుంచి 31వ తేదీ వరకూ రెండు సెషన్లుగా అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 16 ప్రభుత్వ, 2 ఎయిడెడ్, 11 ప్రైవేటు అన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు కలిపి మొత్తం 29 కేంద్రాల్లో ఈ పరీక్షలు జరుగుతాయి. ప్రథమ, ద్వితీయ సంవత్సరాలు కలిపి జిల్లావ్యాప్తంగా 22,379 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయనున్నారు. ఫస్టియర్ జనరల్ 14,600, ఒకేషనల్ 906, సెకండియర్ జనరల్ 6,293, ఒకేషనల్ 580 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నారు. వీరికి ఇప్పటికే ప్రత్యేక తరగతులు కూడా నిర్వహిస్తున్నారు. పరీక్షల నిర్వహణకు 29 మంది చీఫ్ సూపరింటెండెట్లు, కస్టోడియన్లను నియమిస్తున్నారు. స్టోరేజ్ పాయింట్లలో ప్రశ్నపత్రాలను భద్రపరచనున్నారు. జిల్లా వృత్తి విద్యా అధికారి (డీవీఈఓ), హైపవర్ కమిటీ, సిటింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. వీటి ద్వారా పరీక్షల నిర్వహణను ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులు నేరుగా పర్యవేక్షించనున్నారు.

రెండు సెషన్లుగా..

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను రెండు సెషన్లుగా నిర్వహిస్తారు. ఫస్టియర్ విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ.. సెకండియర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ ఈ పరీక్షలు జరుగుతాయి. విద్యార్థులు తమకు కేటాయించిన కేంద్రానికి అరగంట ముందుగా చేరుకోవాల్సి ఉంటుంది. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పరీక్షా కేంద్రాల్లో అవసరమైన వైద్య సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచుతారు. ఈ పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్ జె.నివాస్ ఆధ్వర్యాన త్వరలో సమన్వయ శాఖల సమావేశం జరగనుంది. ఇంటర్ బోర్డ్ అధికారులతో పాటు, వైద్య, ఆరోగ్య శాఖ, ఆర్టీసీ, పోలీసు, పోస్టల్, రెవెన్యూ, మునిసిపల్, డీఈఓ, డీపీఓ తదితర ఎనిమిది శాఖల అధికారులతో ఈ సమావేశం నిర్వహిస్తారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా డెస్కులు, తాగునీరు, టాయిలెట్లు తదితర సౌకర్యాలతో పాటు, బస్సులు అందుబాటులో ఉంచడం, వైద్య శిబిరాలు తదితర అంశాలపై ఈ సమావేశంలో సమీక్షిస్తారు.

ఏర్పాట్లు పూర్తి



విద్యార్థులు పరీక్షలు సౌకర్యవంతంగా రాసేందుకు అన్ని చర్యలూ చేపడుతున్నాం. మౌలిక సదుపాయాలపై దృష్టి సారిస్తాం. అన్ని శాఖలనూ సమన్వయం చేసుకుంటూ పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం.

– జీజీకే నూకరాజు, జిల్లా ఇంటర్మీడియెట్ విద్యా శాఖ అధికారి, కాకినాడ

ఇదీ పరీక్షల టైమ్ టేబుల్

తేదీ	ఫస్టియర్/సెకండియర్
మే 24	సెకండ్ లాంగ్వేజ్
మే 25	ఇంగ్లిషు
మే 27	గణితం, బోటనీ, సివిక్స్
మే 28	మ్యాథ్స్, జువాలజీ, హిస్టరీ
మే 29	ఫిజిక్స్, ఎకనామిక్స్
మే 30	కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ, మ్యూజిక్
మే 31	పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ లాజిక్, బ్రిడ్జి కోర్సు మ్యాథ్స్

అన్నదాత కన్నీరు తుడిచేలా..

- మిచాంగ్ తుపానుతో జిల్లాలో 13,541 హెక్టార్లలో పంట నష్టం
- పరిహారం విడుదల చేసిన ప్రభుత్వం
- జిల్లాలో నష్టపోయిన రైతులు 29,730 మంది
- వారి ఖాతాల్లో జమ కానున్న రూ.23.11 కోట్లు



సామర్లకోట మండలంలో మిచాంగ్ తుపాను పంట నష్టాన్ని అంచనా వేస్తున్న వ్యవసాయ సిబ్బంది (ఫైల్)

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): గత ఏడాది డిసెంబర్ మొదటి వారంలో మిచాంగ్ తుపాను ప్రభావంతో జిల్లాలో సుమారు 13,541 హెక్టార్లలో వరితో పాటు వివిధ రకాల పంటలకు తీరని నష్టం వాటిల్లింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆదేశాల మేరకు పంట నష్టపరిహారాలు రూపొందించేందుకు అధికార యంత్రాంగం అదే నెలలో ఆగమేఘాల మీద కదిలింది. యుద్ధప్రాతిపదికన పంట నష్ట పరిహారం అంచనాలు తయారు చేశారు. జిల్లా వ్యాప్తంగా 12,451 హెక్టార్లలో వరి, 243 హెక్టార్లలో పత్తి, 96.54 హెక్టార్లలో మినుములు, 33.83 హెక్టార్లలో మొక్కజొన్న, 716 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్లు తుది లెక్కలు రూపొందించి, ప్రభుత్వానికి నివేదించారు. ఈ పంటలకు రూ.23.11 కోట్ల మేర నష్టం వాటిల్లిందని నిర్ధారించారు. ఈ నివేదిక ఆధారంగా పంట నష్ట పరిహారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధం కాగా ఎన్నికల పేరుతో టీడీపీ నాయకులు మోకాలడ్డారు. రైతుల ఖాతాల్లో పంట నష్టపరిహారం జమ చేయకుండా ఆపాలని టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికల కమిషన్‌కు సైతం లేఖలు రాశారు. దీంతో రాష్ట్రంలో ఎన్నికలు పూర్తయ్యేంత వరకూ పంట నష్టపరిహారం జమ చేసేందుకు ఎన్నికల కమిషన్ అనుమతి ఇవ్వలేదు. ఈ నెల 13న ఎన్నికలు ముగియడంతో ప్రభుత్వం రైతుల కన్నీరు తుడిచేలా.. వారి ఖాతాల్లో శనివారం నుంచి పంట నష్టపరిహారం జమ చేయడానికి శ్రీకారం చుట్టింది.

సీజన్ ముగిసిన వెంటనే పరిహారం

ప్రకృతి వైపరీత్యాలతో పంటలు దెబ్బ తింటే ఆ పంట కాలం ముగిసిన వెంటనే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతుల ఖాతాల్లో పరిహారాన్ని జమ చేసి, వారి కన్నీరు తుడిచింది. గతంలో చంద్రబాబు అధికారంలో ఉండగా రైతుల పంట నష్టపరిహారాన్ని ఎగ్గొట్టిన సందర్భాలు అనేకం ఉన్నాయి. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరుసార్లు భారీ వర్షాల కారణంగా జిల్లాలో భారీగా పంట నష్టం సంభవించింది. కానీ నాటి చంద్రబాబు ప్రభుత్వం రెండుసార్లు మాత్రమే రైతులకు పరిహారం అందించి, మిగిలిన సీజన్లకు ఎగనామం పెట్టింది. ఈవిధంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రూ.250 కోట్లు పైగా రైతులకు ఇవ్వాల్సిన డబ్బులు ఎగ్గొట్టారు. అధికారంలో ఉన్నన్నాళ్లూ రేపు మాపు అని చెప్పి రైతులను వంచించారు. 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు సానుకూల దృక్పథాన్ని ప్రదర్శించింది. ఎప్పటికప్పుడు పంట కాలం ముగిసిన వెంటనే ఏమాత్రం ఆలస్యం చేయకుండా రైతుల ఖాతాల్లో పరిహారం జమ చేసింది.

రైతులకు ఎంతో ఉపయోగం



ప్రస్తుతం రైతులు ఖరీఫ్ విత్తనాల కొనుగోలుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇటువంటి తరుణంలో గత డిసెంబర్ నెలలో దెబ్బ తిన్న పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం జమ చేయడం వారికి ఎంతో మేలు చేస్తుంది. ఈ ప్రభుత్వం గత ఐదేళ్లుగా సీజన్ ముగియకుండానే రైతులకు పంట నష్టపరిహారం అందించింది.

– ఎస్.విజయ్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి

మండలాల వారీగా వరి, మినుము, పత్తి, మొక్కజొన్న పంటలకు నష్ట పరిహారం ఇలా..

మండలం	పంట నష్టం (హెక్టార్లలో)	నష్టపోయిన రైతులు	పరిహారం (రూ.లక్షల్లో)
గండేపల్లి	8.80	13	0.88
గొల్లప్రోలు	1,673.82	3,871	277.34
జగ్గంపేట	1,026.17	2,172	174.34
కాజులూరు	537. 05	1,152	91.30
కాకినాడ రూరల్	403.53	665	68.60
కాకినాడ అర్బన్	34.01	69	5.78
కరప	275.74	618	46.88
కిర్లంపూడి	940	1,391	159.80
కోటనందూరు	785.66	1,575	133.56
పెదపూడి	516.55	993	87.81
పెద్దాపురం	151	290	25.56
పిఠాపురం	427.12	1,049	72.61
పత్తిపాడు	892.78	1,863	151.53
రౌతులపూడి	192.38	592	32.70
సామర్లకోట	1,019.26	1,424	173.27
శంఖవరం	142.38	330	24.20
తాళ్లరేవు	443.30	972	75.36
తొండంగి	2,096.29	5,385	356.37
తుని	341.66	1,162	58.08
యు.కొత్తపల్లి	311.23	598	52.91
ఏలేశ్వరం	474.35	1,224	80.64

వీటితో పాటు జిల్లాలో 716 హెక్టార్లలో 2,094 మంది రైతులకు చెందిన బొప్పాయి, అరటి వంటి ఉద్యాన పంటలు కూడా దెబ్బ తిన్నాయి. వీటికి కూడా రూ.1.39 కోట్లు జమ కానున్నాయి.

క్లుప్తంగా

ఎమ్మెల్యే వేగుళ్లపై అట్రాసిటీ కేసు

కపిలేశ్వరపురం: మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ, వల్లూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వల్లూరి వీర్రాజు (వీరబాబు)లపై శుక్రవారం పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారు. తమను నిందితులు ముగ్గురూ కులం పేరుతో దూషించారంటూ వల్లూరు గ్రామానికి చెందిన ముగ్గురు విడివిడిగా పోలీసులకు ఫిర్యాదులు చేయడంతో కేసులు నమోదయ్యాయి. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజున వైఎస్సార్ సీపీ అభ్యర్థి తరఫున పోలింగ్ ఏజెంట్‌గా ఉన్న తనను ఎమ్మెల్యే జోగేశ్వరరావు, లీలాకృష్ణ, వీరబాబులు కులం పేరుతో దూషించారంటూ రోకేష్ ఫిర్యాదు చేశారు. పోలింగ్ రోజున జరిగిన దాడిని అడ్డుకోగా తనను కులం పేరుతో వారు దూషించారంటూ అదే గ్రామానికి చెందిన నక్కా భాస్కరరావు మరో ఫిర్యాదు అందజేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేస్తావా అంటూ ఆ ముగ్గురూ కులం పేరుతో దూషించారంటూ బుర్రిలంకలో ఉంటున్న వల్లూరుకు చెందిన నక్కా అమ్మిరాజు ఫిర్యాదు ఇచ్చారు.

వ్యక్తి ఆత్మహత్య

నిడదవోలు రూరల్: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో ఓ వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు సమిశ్రగూడెం ఎస్సై రమేష్ శనివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నిడదవోలు మండలం తాడిమళ్ల గ్రామానికి చెందిన దిరిసిమిల్లి పోతురాజు (47)కు కంసాలిపాలెం గ్రామానికి చెందిన నాగలక్ష్మికి కొన్నేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. కొంతకాలంగా భార్య, పిల్లలు తన వద్ద ఉండటం లేదని మనస్థాపానికి గురైన పోతురాజు శనివారం ఉదయం పురుగు మందు తాగాడు. అతన్ని వెంటనే వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పోతురాజు మృతి చెందినట్లు భార్య నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.


మృతుడు ఈశ్వర్‌రెడ్డి (ఫైల్)


మృతుడు జయకుమార్ (ఫైల్)


గల్లంతైన సంపత్‌రెడ్డి (ఫైల్)


ప్రమాద స్థలంలో ఈశ్వర్‌రెడ్డి, జయకుమార్ మృతదేహాలు


ఒడ్డున కూర్చున్న సత్యనారాయణరెడ్డి

నిండు ప్రాణాలు.. గోదారమ్మ ఒడిలోకి..

- ఉసురు తీసిన ఈత సరదా
- నదిలో స్నానానికి దిగి ఇద్దరి మృతి
- మరో యువకుడి గల్లంతు

గోదావరిలో గాలిస్తున్న స్థానికులు, అధికారులు



రావులపాలెం: ఈత సరదా.. నిండు ప్రాణాలనే మింగేసింది. అప్పటి వరకూ ఆనందంగా గడిపిన వారిని అనంత లోకాలకు తీసుకెళ్లింది.. యువకుల మృతి ఘటన ఆయా కుటుంబాల్లో పుట్టెడు శోకాన్ని మిగిల్చింది.. రావులపాలెం వద్ద గౌతమి పాత బ్రిడ్జి సమీపంలో శనివారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. సీఐ ఎం.ఆంజనేయులు కథనం ప్రకారం.. రావులపాలెం చిన్న వంతెన సమీపంలో నివాసం ఉంటున్న సబ్బెళ్ల సత్యనారాయణరెడ్డి, ఈశ్వర్‌రెడ్డిలు అన్నదమ్ములు. వీరికి వరుసకు తమ్ముడయ్యే, పిన్ని కొడుకు సత్తి సంపత్‌రెడ్డి విజయనగరం నుంచి వేసవి సెలవులకు పెద్దమ్మ ఇంటికి వచ్చాడు. ఈ ముగ్గురితోపాటు స్థానికులైన మరో ఇద్దరు పెంట జయకుమార్, కొమ్మర్తి రాజేష్ మొత్తం ఐదుగురు కలసి సాయంత్రం సమయంలో గోదావరిలో స్నానం చేసేందుకు స్థానిక గౌతమి నది వద్దకు వెళ్లారు. పాత బ్రిడ్జి సమీపంలో నదీ ప్రవాహం వద్దకు చేరుకుని సత్యనారాయణరెడ్డి మినహా మిగిలిన నలుగురూ స్నానానికి దిగారు. సత్యనారాయణరెడ్డికి ఈత రాకపోవడంతో ఒడ్డున సెల్‌ఫోన్ చూసుకుంటూ కూర్చున్నాడు. కొంత సమయానికి రాజేష్ కంగారుగా ఒడ్డుకు రావడంతో ఏమైందని అడిగాడు. నదీ ప్రవాహంలో ముగ్గురు కొట్టుకుపోయారని చెప్పడంతో అక్కడ ఉన్న మరో ఇద్దరి సహాయంతో గోదావరిలో గాలించారు. ఎంతకీ ప్రయోజనం లేకపోవడంతో ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు ఫోన్లో తెలిపారు. దీంతో సమాచారం అందుకున్న బంధువులు, పోలీసులు, రెవెన్యూ, అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలికి చేరుకుని రెండు బోట్లతో గాలింపు చర్యలు చేపట్టారు. కొంతసేపటికి సబ్బెళ్ల ఈశ్వర్‌రెడ్డి (20), పెంట జయకుమార్ (19)ల మృతదేహాలు లభ్యమయ్యాయి. అయితే గల్లంతైన సంపత్‌రెడ్డి కోసం చీకటి పడే వరకూ అధికారులు గాలింపు చర్యలు కొనసాగించారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో నదీ ప్రవాహానికి వలలు అడ్డంగా కట్టి గాలింపు నిలిపివేశారు. తిరిగి ఆదివారం గాలింపు చేపడతామని సీఐ తెలిపారు. అనంతరం మృతదేహాలను పోలీసులు కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెలు అవిసేలా రోదిస్తూ..

నదీ ప్రవాహంలో కొట్టుకుపోయి సొంత తమ్ముడు ఈశ్వర్‌రెడ్డి మృతి చెందడం, పిన్ని కొడుకు మరో తమ్ముడైన సంపత్‌రెడ్డి గల్లంతు కావడంతో సత్యనారాయణరెడ్డి సంఘటనా ప్రదేశంలో రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టింది. సరదాగా ఈత కోసం వచ్చామని, తనకి ఈత రాకపోవడంతో ఒడ్డునే కూర్చున్నానని, కళ్ల ముందే వారు గల్లంతయ్యారంటూ సత్యనారాయణరెడ్డి గుండెలు అవిసేలా రోదించాడు.

కుటుంబ నేపథ్యాలివీ..

సూర్యనారాయణరెడ్డి వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతని చిన్న కొడుకు ఈశ్వర్‌రెడ్డి ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఈ ప్రమాదంలో ఈశ్వర్‌రెడ్డి మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని విషాదంలోకి నెట్టేసింది. సెలవుల కోసం విజయనగరం నుంచి వచ్చిన సూర్యనారాయణరెడ్డి భార్య చెల్లెలి కొడుకు సంపత్‌రెడ్డి పదో తరగతి పరీక్ష రాసి వేసవి సెలవుల కోసం రావులపాలెం వచ్చాడు. సంపత్‌రెడ్డి గల్లంతు కావడంతో ఈ విషయాన్ని విజయనగరంలో ఉన్న తల్లిదండ్రులకు ఫోన్లో తెలిపారు. సంపత్‌రెడ్డి తండ్రి దుర్గారెడ్డి అనపర్తి నుంచి ఫైనాన్స్ వ్యాపారం నిమిత్తం విజయనగరం వెళ్లి స్థిరపడ్డాడు. ఉన్న కూతురు, కొడుకులో చిన్నవాడైన సంపత్‌రెడ్డి మృతి చెందడంతో తీవ్రంగా విలపిస్తున్నారు. ఈ ఘటన ఆ రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. మరో మృతుడు జయకుమార్ తండ్రి సుబ్రహ్మణ్యం వడ్రంగి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సుబ్రహ్మణ్యానికి కూతురు, కొడుకు సంతానం. జయకుమార్ స్థానిక డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతూ ఖాళీ సమయంలో ఫొటో స్టూడియోలో పనిచేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉంటున్నాడు. చేతికి అందివచ్చాడనుకున్న కొడుకు మృతి చెందడంతో ఆ తండ్రి విలపిస్తున్న తీరు అందరినీ కలచి వేసింది.

ఆ ఘటన మరువక ముందే..

ఇటీవల ఆలమూరు మండలం మడికికి చెందిన ముగ్గురు మహిళలు బడుగువానిలంక సమీపంలో గోదావరి దాటుతూ నదీ ప్రవాహానికి ఊబిలో కూరుకుపోయి మృతి చెందారు. ఇది మరువక ముందే రావులపాలెం వద్ద గౌతమి పాత బ్రిడ్జి సమీపంలో ఈ ఘటన జరగడం గమనార్హం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు, పోలీసులు గ్రామాల్లో ప్రచారం నిర్వహించాలని అంతా కోరుతున్నారు.

కళ్ల ముందే కొట్టుకుపోయారు: కొమ్మర్తి రాజేష్


ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడిన కొమ్మర్తి రాజేష్

నలుగురూ కలసి గోదావరిలో స్నానం చేస్తుండగా నదీ ప్రవాహం ఎక్కువ కావడం**తో ముగ్గురు కొట్టుకుపోయారు. నేను అంతా గాలించినా ప్రయోజనం లేకపోవడంతో ఒడ్డుకు వచ్చి ఈ విషయాన్ని అక్కడున్న వారికి చెప్పాను. అయినా** అప్పటికే వారు నదీ ప్రవాహంలో కొట్టుకుపోయారని స్నానానికి దిగి సురక్షితంగా బయటపడిన కొమ్మర్తి రాజేష్ తెలిపాడు. స్నేహితుల మృతితో తీవ్ర కలత చెందుతున్నాడు.

అన్ని దారులూ అన్నవరానికే..


సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను వధూవరులను చేసి పూజలు నిర్వహిస్తున్న పండితులు


స్వామి, అమ్మవార్లను ఎదుర్కోలు ఉత్సవానికి ఊరేగింపుగా తీసుకు వస్తున్న అధికారులు, భక్తులు

- కల్యాణ తిలకం దిద్దుకున్న సత్యదేవుడు
- లోక కల్యాణానికి నేడే సుమూర్తం
- 24 వరకూ ఉత్సవాల నిర్వహణ

అన్నవరం: కల్యాణ వీణ మోగింది.. సత్యదేవుని కల్యాణోత్సవాలకు అంకురార్పణ జరిగింది.. సరికొత్త కాంతులతో అన్నవరం సొబగులను అద్దుకుంది.. సత్యదేవుని దివ్య పరిణయోత్సవానికి శుభ సమయం ఆసన్నమవుతున్న వేళ, రత్నగిరి శోభాయమానంగా వెలుగొందుతోంది.. కల్యాణ తిలకం దిద్దుకున్న సత్యదేవుడు, ఆ అమ్మవార్లను చూసిన భక్తజనం మురిసిపోయింది.. కాకినాడ జిల్లాలోని అన్నవరం సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో స్వామివారి కల్యాణోత్సవాలు శనివారం అట్టహాసంగా ఆరంభమయ్యాయి. భక్తవరదుడు, కోరిన కోర్కెలు తీర్చే రత్నగిరివాసుడు సత్యదేవుడే వరుడైన వేళ, సిరులొసంగే అనంత లక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు వధువైన శుభవేళ రత్నగిరి పులకించింది. వారం రోజులపాటు అంగరంగ వైభవంగా జరుగనున్న శ్రీసత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలకు వైశాఖ శుద్ధ దశమి శనివారం సాయంత్రం రత్నగిరిపై పండితులు శ్రీకారం చుట్టారు.

సీతారాములే పెళ్లి పెద్దలుగా...

రత్నగిరి క్షేత్రపాలకులు శ్రీసీతారాములు పెళ్లి పెద్దలుగా వెంట రాగా, శ్రీసత్యదేవుడు, అమ్మవార్లను సాయంత్రం నాలుగు గంటలకు ఊరేగింపుగా అనివేటి మండపానికి తీసుకు వచ్చారు. అక్కడ సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన కల్యాణ మండపంలో ప్రత్యేక ఆసనంపై సత్యదేవుడు, అమ్మవార్లను, పక్కనే మరో ఆసనంపై పెళ్లిపెద్దలు సీతారాములను ప్రతిష్ఠించి పండితులు ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల మంత్రోచ్చరణ మధ్య స్వామి, అమ్మవార్లను పండితులు పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెను చేశారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్రమోహన్ దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం శుభం కోరుతూ ముత్తయిదువలు పసుపు దంచారు. ఈ పూజలను దేవస్థానం వేదపండితులు గొల్లపల్లి ఘనాపాఠి, గంగాధరభట్ల గంగబాబు, యనమంద్ర శర్మ, చిట్టిశివ, ముష్టి పురుషోత్తం, ప్రధానార్చకులు ఇంద్రగంటి నరసింహమూర్తి, కోట సుబ్రహ్మణ్యశర్మ, అర్చకులు తదితరులు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను వధూవరులను చేసిన అనంతరం రామారాయ కళావేదికపై సత్యదేవుడు, అమ్మవార్ల ఎదుర్కోలు ఉత్సవం జరిపారు. రాత్రి ఏడు గంటల నుంచి ఎనిమిది గంటల వరకూ ఈ కార్యక్రమం సాగింది.

నేడు అపురూప ఘట్టం

వైశాఖ శుద్ధ ఏకాదశి ఆదివారం రాత్రి తొమ్మిది గంటల నుంచి సత్యదేవుడు, అమ్మవార్ల దివ్య కల్యాణోత్సవం రత్నగిరిపై ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రజాప్రతినిధులకు ఎటువంటి ప్రత్యేకత లేకుండా భక్తులతో పాటు ఆహ్వానించారు. జిల్లా కలెక్టర్ నివాస్, ఇతర ఉన్నతాధికారులను కూడా ఆహ్వానించారు. స్వామివారి కల్యాణం తిలకించేందుకు సుమారు 20 వేల మంది భక్తులు విచ్చేస్తారని అంచనాతో ఏర్పాట్లు చేశారు. కల్యాణాన్ని ప్రత్యక్షంగా వీక్షించేలా కల్యాణ వేదిక ముందు మండపంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. కల్యాణం అనంతరం భక్తులకు ప్రసాదం, అక్షతల ప్యాకెట్లను కల్యాణ వేదికకు ఎదురుగా ఉన్న సర్క్యులర్ మండపంతో పాటు పశ్చిమ రాజగోపురం వద్ద మరో నాలుగు చోట్ల పంపిణీ చేయనున్నారు. భక్తులకు అన్నదాన భవనంలో భోజన సౌకర్యం కల్పిస్తున్నారు. భక్తుల వాహనాలను కొండ దిగువ కళాశాల మైదానం వరకే అనుమతిస్తారు. అక్కడి నుంచి ప్రత్యేక బస్సుల ద్వారా కొండపైకి వచ్చేలా చర్యలు తీసుకున్నారు. 300 మంది పోలీసులతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేశారు. భక్తులకు మంచినీటి సరఫరాకు వలంటీర్లు, సేవా కార్యకర్తలను నియమించారు.

ఏర్పాట్లపై ఈఓ సమీక్ష

ఆదివారం జరుగనున్న సత్యదేవుని కల్యాణ మహోత్సవ ఏర్పాట్లపై దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల ప్రకారం సిబ్బందికి అప్పగించిన బాధ్యతలను నిర్వర్తించాలని ఆదేశించారు. ఉదాశీనంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

రత్నగిరిపై విద్యుత్ దీపాలంకరణ




శుభం కోరుతూ పసుపు దంచుతున్న ముత్తయిదువలు

బోధనలో మార్పులను ఆకళింపు చేసుకోవాలి


ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్జేడీ కృష్ణ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఆంధ్ర రాష్ట్ర కళాశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో మూడు రోజులుగా రాష్ట్రంలోని వివిధ డిగ్రీ కళాశాల అధ్యాపకులకు నిర్వహిస్తున్న క్రియేటివ్ ఈ- కంటెంట్ జనరేషన్ శిక్షణ శనివారంతో ముగిసింది. దీనికి కళాశాల ఆర్జేడీ డాక్టర్ చప్పిడి కృష్ణ హాజరై మాట్లాడుతూ ఉన్నత విద్య బోధనా విధానంలో వస్తున్న పెను మార్పులను కళాశాలల అధ్యాపకులు ఆకళింపు చేసుకోవాలన్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న కృత్రిమ మేధ(ఏఐ)ను ఉపయోగించి పాఠ్య ప్రణాళిక రూపొందించి, తదనుగుణంగా విద్యా బోధన సాగించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర.ఆర్‌కే మాట్లాడుతూ డిజిటల్ పద్ధతులను అధ్యాపకులు తమ విద్యా బోధనలో ప్రవేశపెట్టాలన్నారు. ఉన్నత విద్యలో నిన్న, నేడు, రేపు అనే ప్రాతిపదికన వస్తున్న మార్పులను తెలుసుకోవాలన్నారు. ఈ పద్ధతులను ఏఐతో అనుసంధానించి విద్యా బోధన సాగించడంలో ఆర్ట్స్ కళాశాల ముందంజలో ఉందన్నారు. కృత్రిమ మేధ పద్ధతుల్లో ప్రవీణుడు డాక్టర్ సునీల్ మ్యాజిక్ స్కూల్ వంటి సాఫ్ట్‌వేర్‌లను ఉపయోగించి పాఠ్య ప్రణాళికను ఎలా రూపొందించాలో వివరించారు. బెంగళూరుకు చెందిన డాక్టర్ నాగేంద్ర పలు అంశాలు వివరించారు. శిక్షణకు బి.వెంకట్రావు సమన్వయకర్తగా, ఏపీసీసీఈకు చెందిన డాక్టర్ జె.జ్యోతి పర్యవేక్షకులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఎస్.శ్రీనివాస్, సంజీవ్ కుమార్, కిరణ్ కుమార్, ప్రవీణ్ అధ్యాపకులు పాల్గొన్నారు.

ఐటీఐతో ఉద్యోగ అవకాశాలు


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉపాధి కల్పనాధికారి వసంతలక్ష్మి

కాకినాడ సిటీ: కాకినాడలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో శనివారం ఒకేషనల్ గైడెన్స్ కో ఆర్డినేషన్ కమిటీ సమావేశం జిల్లా ఉపాధి కల్పనాధికారి, కమిటీ కన్వీనర్ వసంతలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వసంతలక్ష్మి మాట్లాడుతూ ఐటీఐలో 100 శాతం అడ్మిషన్లు జరిగేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఐటీఐ చదవడం వల్ల ఉద్యోగ అవకాశాలు మెరుగ్గా ఉంటాయన్నారు. ఐటీఐ ప్రిన్సిపాల్ జీవీకే వర్మ మాట్లాడుతూ ఐటీఐ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు జూన్ పదో తేదీ వరకూ స్వీకరించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ త్వరితగతిన వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్ కోసం రిజిస్టర్ కావాలన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ కూడా చేయించుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోవాలని వసంతలక్ష్మి కోరారు.